

టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు ధర పలికాయి.



కల్తీ ముంత..

జిల్లా స్థాయి అధికారి దందాతో కింది స్థాయి ఉద్యోగులు బెంబేలెత్తుతున్నారు. ఎవరి మాట వినని సీతయ్య అక్రమ వసూళ్లను కొనసాగిస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.2°/21.8°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

పనిదినాలు సద్వినియోగం చేసుకోండి



సమావేశమైన పీడీ రామాంజనేయులు

బత్తలపల్లి: వలసల నివారణ ధ్యేయంగా చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వంద రోజులు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని పీడీ రామాంజనేయులు కూలీలకు సూచించారు. గురువారం మండలంలోని ఓబుళాపురం పంచాయతీ కోడేకండ్ల ఎస్సీ కాలనీలో ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ జాబ్‌కార్డు పొందిన ప్రతి కుటుంబం కూలీ పనులకు హాజరు కావాలన్నారు. పనులకు రాని కూలీల జాబ్‌కార్డులను రద్దు చేయాలన్నారు. అడిగిన వెంటనే పనులు కల్పిస్తున్నామన్నారు. వర్షాకాలంలోనూ పనులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అందువల్ల ఎవరూ వలసలు వెళ్లకుండా వంద రోజులు పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీడీ వెంకటాచలపతి, ఏపీఓ కుందానం ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీశుని సేవలో సినీ నటి ఆమని



సినీ నటి ఆమనికి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని ప్రముఖ సినీ నటి ఆమని గురువారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు రాగానే ఆలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. తాడిపత్రిలో షూటింగ్‌కు వచ్చి దైవదర్శన కోసం కదిరికి వచ్చినట్లు ఆమని తెలిపారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ విశిష్టతను వివరించారు. తీర్థప్రసాదలు అందజేసి, శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆమనితో ఫొటోలు దిగేందుకు భక్తులు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మసీలో ఆనర్స్ డిగ్రీ



మాట్లాడుతున్న వీసీ జింకా రంగజనార్ధన

అనంతపురం: బీ–ఫార్మసీలోనూ ఆనర్స్ విధానం అమలు చేయాలని 5వ ఫార్మసీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ మీటింగ్‌లో నిర్ణయించారు. జేఎన్‌టీయూ (ఏ) పాలక భవనంలో ఫార్మసీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమావేశం గురువారం జరిగింది. సమావేశానికి జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్ధన అధ్యక్షత వహించారు. ఆర్–23 (రెగ్యులేషన్) గురించి విపులంగా చర్చించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు బీ–ఫార్మసీ కోర్సులో ఆనర్స్ లేక రీసెర్చ్ డిగ్రీలను అమలు చేయాలని నిర్ణయించారు. రెగ్యులర్ బీ–ఫార్మసీ చేస్తూనే విద్యార్థులు అదనంగా 12 క్రెడిట్‌లు సాధిస్తే ఆనర్స్ డిగ్రీ ప్రదానం చేస్తారు. స్కిల్ ఓరియంటెడ్ కోర్సులు, నాలుగు ప్రొఫెషనల్ ఎలక్టివ్స్, రెండు ఓపెన్ ఎలక్టివ్స్ , క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ పాలసీని , రెండు సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టనున్నారు. ఆనర్స్ డిగ్రీపై ఆసక్తి గల వారు బీ–ఫార్మసీ మూడో సెమిస్టర్ వరకూ '7 సీజీపీఏ' స్కోరు సాధించాల్సి ఉంటుంది. కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ఈ.కేశవరెడ్డి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఎస్.దేవన్న, డీఏపీ వి.సుమలత, ఐఐటీ ప్రొఫెసర్లు ఆశిత్‌కుమార్, చక్రవర్తి, డాక్టర్ ఎంఎస్‌ఎస్ బయోఫార్మా హైదరాబాద్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, రైపర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన మీనాక్షి



ప్రశాంతి నిలయం: డీఈఓగా మీనాక్షి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పాఠశాల తనిఖీ నిమిత్తం వెళ్లి రామగిరి వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఆమె గాయపడిన విషయం తెలిసిందే. వైద్య చికిత్సల అనంతరం వైద్యుల సూచనల మేరకు ఆమె కొన్నిరోజులుగా విశ్రాంతి తీసుకున్నారు. ఆరోగ్యం మెరుగు పడడంతో బాధ్యతలు స్వీకరించారు.

రేపు దుర్గానికి సీఎం జగన్



- కళ్యాణదుర్గంలో రైతు దినోత్సవంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ఏర్పాట్లలో అధికారులు బిజీ
- సిద్ధమైన హెలీప్యాడ్
- సభా ప్రాంగణం వద్ద ముమ్మర తనిఖీలు
- యుద్ధప్రాతిపదికన విద్యుత్ లైన్లు, రోడ్లు మరమ్మతులు



ముస్తాబైన సభా ప్రాంగణం

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శనివారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని పురస్కరించుకుని కళ్యాణదుర్గంలో నిర్వహించే 'రైతు దినోత్సవం'లో ఆయన పాల్గొంటారు. సీఎం పర్యటనకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా చిన్న లోపం కూడా తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. మల్లాపురం రోడ్డులోని గ్యాస్ గోడౌన్ సమీపంలో హెలీప్యాడ్ ఇప్పటికే సిద్ధం చేశారు. హెలిప్యాడ్ నుంచి ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో సిద్ధం చేస్తున్న సభా స్థలి వరకు దారి పొడవునా బారికేడ్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. శుక్రవారం నాటికి పనులు పూర్తి చేస్తామని విద్యుత్ శాఖ ఈఈ సురేంద్ర తెలిపారు. సీఎం సభ విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్తున్నారు.

ముమ్మర తనిఖీలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు భద్రతలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎం భద్రతా అధికారులు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావును ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ హెలిప్యాడ్, సభా ప్రాంగణం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఉండేలా బందోబస్తు చేపడుతున్నారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణంలో పోలీసులు డాగ్ స్క్వాడ్, మెటల్ డిటెక్టర్ లాంటి ఆధునిక పరికరాలతో తనిఖీ చేస్తున్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

సీఎం సభ ఏర్పాట్లను గురువారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, సీఎం సెక్యూరిటీ అధికారి రంగబాబు, జిల్లా కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్ గార్గ్, ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కళ్యాణదుర్గం ఎన్నికల పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి, అడిషనల్ ఎస్పీలు హనుమంతు, విష్ణు, విజయ్ భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి తదితరులు కూడా ఏర్పాట్లను పరిశీలించారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపడం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎన్.ఎనుమలవారిపల్లి, పుట్టపర్తి మండలంలోని గాజులపల్లి వద్ద 0.5 టీఎంసీల సామర్థ్యంతో రెండు రిజర్వాయర్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే నల్లసింగయ్యగారిపల్లిలోని తన స్వగృహం వద్ద ఎన్.ఎనుమలవారిపల్లి, చెండ్రాయునిపల్లి తదితర గ్రామాల రైతులతో సమావేశమై మాట్లాడారు. రూ.864 కోట్లతో చెరువులను నింపే ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. రిజర్వాయర్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించి ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేస్తామన్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే ఆయా మండలాల్లో సాగు, తాగు నీటికి కొరత ఉండదన్నారు. రిజర్వాయర్‌ల నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు వారు ఆశించిన స్థాయిలో ప్రభుత్వం పరిహారం అందిస్తుందన్నారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా చూస్తానని భరోసా నిచ్చారు. ఈ విషయంపై త్వరలోనే అధికారులందరినీ కలిసి రైతులతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం

పుట్టపర్తి టౌన్: అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేసి సీఎం వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. రైతు దినోత్సవం సందర్భంగా ఈనెల 8న ముఖ్యమంత్రి అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పర్యటనలో భాగంగా పుట్టపర్తి విమానాశ్రయానికి రానున్నారని తెలిపారు. సీఎం పర్యటనలో ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. గురువారం కలెక్టర్ అరుణ్‌బాబు ఎస్పీ ఎస్.వీ మాధవరెడ్డి, అడిషనల్ ఎస్పీ విష్ణు ఇతర శాఖల అధికారులతో కలసి సత్యసాయి విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో మినీ కాన్ఫరెన్స్ హాల్లో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ శనివారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి ఉదయం 9.15 గంటలకు సీఎం జగన్ పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారన్నారు. 9.25 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి కళ్యాణదుర్గం బయలుదేరతారన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో పంటల బీమా సొమ్మును విడుదల చేస్తారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడా చిన్న పొరపాట్లు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కాన్వాయ్, రోప్ పార్టీ, బందోబస్తు, విమానాశ్రయం భద్రతపై కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

17న ఎస్కేయూ స్నాతకోత్సవం

- ఛాన్సలర్ హోదాలో హాజరుకానున్న గవర్నర్ జస్టిస్ నజీర్
- గౌరవ డాక్టరేట్ అందుకోనున్న మహంతేష్



మహంతేష్ జీకే

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం ఈ నెల 17న నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. గవర్నర్ రాక ఖరారు అయినట్లు వర్సిటీ ఉన్నతాధికారులు తెలిపారు. ఒక రోజు ముందే ఆయన అనంతపురం విచ్చేయనున్నట్లు తెలిసింది.

మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్..

వర్సిటీ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని గౌరవ డాక్టరేట్‌ను మహంతేష్ జి. కివాడసన్నవర్ (మహంతేష్ జీ.కే)కు ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు ప్రకటించారు. కర్ణాటక రాష్ట్రం నేగిన్‌హల్‌కు చెందిన మహంతేష్ భారత మాజీ క్రికెటర్ కావడం గమనార్హం. దివ్యాంగుల క్రికెట్ కౌన్సిల్, క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ ఇండియా, వరల్డ్ బ్లైండ్ క్రికెట్ లిమిటెడ్‌కు ఆయన అధ్యక్షుడిగా సేవలందిచారు. 2012లో బ్లైండ్ వరల్డ్ టీ–20 విజేతగా నిలవడంలోనూ, 2017లో రెండో స్థానం సంపాదించడంలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. 2014, 2018లో 4,5 వరల్డ్ ఛాంపియన్‌షిప్ పొందడంలో ఆయన కృషి ఎంతో ఉంది. బ్లైండ్ క్రికెట్ ఆటకు రూపకల్పన చేసి, ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు మహంతేష్ అంకితభావంతో పనిచేశారు. 'సమర్థనం' ట్రస్ట్ ద్వారా వేలాది మంది దివ్యాంగులకు ఉపాధి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. 2019లో స్పిరిట్ స్పోర్ట్స్ ఇండియా అవార్డు, దివ్యజ్ఞాన్ ఎంపవర్‌మెంట్ అవార్డులు ఆయన్ను వరించాయి. ఆయన సేవలు గుర్తించిన ఎస్కేయూ ఉన్నతాధికారులు గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. ఎస్కేయూ ఛాన్సలర్/ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మహంతేష్ పురస్కారం అందుకోనున్నారు.



ఎస్కేయూ ముఖద్వారం

ప్రజలకు పారదర్శకంగా సేవలు

- కలెక్టర్ అరుణ్‌బాబు

చెన్నేకొత్తపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే ద్వారా ప్రజలకు కావాల్సిన సేవలను గుర్తించి అర్హత కలిగిన వారిని పారదర్శకంగా సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. చెన్నేకొత్తపల్లి మండలంలోని ఓబుళంపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 99 శాతం మంది ప్రభుత్వ పథకాలను అందుకుంటున్నారని, మిగిలిన ఒక్క శాతం అర్హులైన వారికి న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా 11 రకాల సేవలను ప్రభుత్వ ఉచితంగా అందజేస్తోందని జగనన్న సురక్షపై క్షేత్రస్థాయిలో అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అర్హులైన 904 మంది లబ్ధిదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ తిప్పేస్వామి, డీఎల్‌డీఓ శివారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ గంగావతి, ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణపత్రం అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

1007 సర్టిఫికెట్ల అందజేత

పుట్టపర్తి అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గురువారం ఒక్క రోజే 1007 ధ్రువపత్రాలు అందజేసినట్లు ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ భాగ్యరేఖ, మండల ప్రత్యేకాధికారి శుభదాస్ పేర్కొన్నారు. పుట్టపర్తి మండలం పెడపల్లి సచివాలయం–1లో గురువారం సురక్ష గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభకు విచ్చేసిన లబ్ధిదారులకు ఎంపీపీ ఏవి రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవా సర్టిఫికెట్లు అందజేశారు.

మెరుగైన సేవలందించాలి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జగహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. గురువారం జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం ,రీ సర్వే, పంచాయతీరాజ్ , వ్యవసాయం తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్ తదితరులు పాల్గొన్నారు. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్షకు సంబంధించి వచ్చిన అర్జీలకు టోకెన్స్ రైజ్ చేసి వాటికి రిక్వెస్ట్ రూపంలో నమోదు చేసి మెరుగైన సేవలను అందించాలన్నారు. ఇప్పటి వరకూ 15 లక్షల టోకెన్స్‌రైజ్ చేయగా 13 లక్షల సర్వీస్ రిక్వెస్టులు నమోదు చేసి 11 లక్షల దరఖాస్తులను అప్రూవ్ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ భవనాలు ప్రాధాన్యత క్రమంలో త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు.

అర్హులందరికీ న్యాయం

గోరంట్ల: అర్హులైన పేదలందరికీ వందశాతం సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం సురక్ష కార్యక్రమం చేపట్టిందని జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గౌనివారిపల్లి, మలసముద్రం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై ఆయా పంచాయతీ సర్పంచుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల్లో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు గుర్తించిన లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథగుప్తా, సర్పంచులు బోయ ప్రమీల, సువర్ణమ్మ పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

- నారాయణ, చైతన్య స్కూళ్లలో దోపిడీ
- షూ, టై, బెల్ట్, యూనిఫాం, బుక్స్ పేరుతో భారీగా వసూళ్లు
- అనుమతులు లేకుండానే అడ్మిషన్లు
- చర్యలు తప్పవంటున్న డీఈఓ

కొత్తచెరువుకు చెందిన ఓ చిరు ఉద్యోగి తన కుమార్తెను నారాయణ పాఠశాలలో ఆరో తరగతిలో చేర్చారు. ఏడాది ఫీజు రూ.30 వేలుగా మాట్లాడారు. ఆ తర్వాత పుస్తకాల పేరుతో మరో రూ.8 వేలు కట్టాలని అడిగారు. అనంతరం యూనిఫాం, షూ, టై, బెల్ట్ పేరుతో మరో రూ.5 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అక్కడ ఇచ్చే పుస్తకాలతో పాటు మరికొన్ని బయట కొనాలని చెప్పారని ఆ ఉద్యోగి తెలిపారు. ఆరో తరగతికే దాదాపుగా రూ.50 వేల ఖర్చు అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుట్టపర్తికి చెందిన ఓ రైతు తన ఇద్దరు పిల్లలను కొత్తచెరువులోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో 1, 4 తరగతుల్లో చేర్చారు. ఇద్దరికీ కలిపి ఏడాదికి రూ.46 వేలు ఫీజు అడిగారు. పుస్తకాలకు రూ.9 వేలు, బస్సు ఫీజు రూ.10 వేలు, యూనిఫాం, టై, బెల్టు పేరుతో మరో రూ.8 వేలు డిమాండ్ చేశారని రైతు తెలిపాడు. అడ్మిషన్ల సమయంలో చెప్పిన ఫీజులతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో వసూలు చేస్తున్నారని వాపోయారు. విద్యా శాఖాధికారుల నుంచి అనుమతులు రాకపోవడంతో ఫీజులు కట్టాలా? వద్దా? అని సందిగ్ధంలో ఉన్నట్లు తెలిపారు.



7వ తరగతి వరకే అనుమతులు ఉన్నా టెన్త్ తరగతులు నిర్వహిస్తున్న నారాయణ స్కూల్



కొత్తచెరువులో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్య ఇన్‌స్టిట్యూట్

సాక్షి, పుట్టపర్తి: జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఫీజుల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. విద్యార్థులు ప్రవేశం పొందే వరకు కొంత .. ఆ తర్వాత మరికొంత దండుకుంటున్నారు. బస్సు ఫీజు, పుస్తకాల ఫీజు, యూనిఫాం, టై, బెల్టు తదితర పేరుతో రూ.వేలల్లో రాబడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించగా.. 'అడ్మిషన్ చేసినప్పుడు మీరు సంతకం చేసిన పేపరులో వీటన్నింటికీ ఒప్పుకున్నారు కదా'.. అని సమాధానం చెబుతున్నారు. పిల్లల చదువులకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో కూలి పని చేసుకునే వారు కూడా అప్పు తెచ్చిమరీ అడిగినంతా చెల్లిస్తున్నారు. అయితే ఆయా పాఠశాలలకు అనుమతులు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో ఏ సమయంలో మూతపడుతాయో తెలియని పరిస్థితుల్లో కొందరు ఫీజులు కట్టకుండా కాలయాపన చేస్తున్నారు. అలాంటి తల్లిదండ్రులకు పదే పదే ఫోన్ చేసి 'ఫీజులు కడుతారా? లేక పిల్లలను ఇంటికి పంపించాలా?' అని యాజమాన్యం నుంచి ఫోన్లు వస్తుండటంతో ఏం చేయాలో వారికి పాలుపోవడం లేదు.

అనుమతులు లేకుండానే తరగతులు

కొత్తచెరువులోని నారాయణ పాఠశాలకు ఏడో తరగతి వరకు మాత్రమే అనుమతులు ఇచ్చారు. కానీ పదో తరగతి వరకు నడుపుతున్నారు. ఇదేంటని ఎవరైనా అడిగితే.. త్వరలోనే అనుమతుల పత్రాలు వస్తాయని చెబుతున్నారు. విద్యాశాఖాధికారులు కూడా స్కూల్ యాజమాన్యానికి నోటీసులు పంపించారు. విద్యార్థులను చేర్చుకూడదంటూ ప్రకటన కూడా విడుదల చేశారు. కానీ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆ స్కూల్ యాజమాన్యం పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తుండటం విశేషం. అదేవిధంగా శ్రీచైతన్య విద్యాసంస్థలకు అనుమతులే రాలేదు. కానీ పదో తరగతి వరకు సుమారు వెయ్యి మందికి ప్రవేశాలు కల్పించారు. పాఠశాల సీజ్ చేసి.. విద్యార్థులను ఇంటికి పంపినా.. మళ్లీ యథావిధిగా స్కూల్ నడిపిస్తున్నారని అధికారులే చెబుతుండటం గమనార్హం.

అనుమతి లేకపోతే చేర్చొద్దు



కొత్తచెరువులో నారాయణ పాఠశాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. శ్రీచైతన్య విద్యాసంస్థలకు అనుమతులే రాలేదు. విద్యార్థులను అనుమతులు ఉన్న తరగతులకు మాత్రమే చేర్చండి. అధికారులకు తల్లిదండ్రులు సహకరించాలి. అనుమతులు లేని తరగతులకు విద్యార్థులను చేర్పితే ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఏ సమయంలో అయినా గేటుకు తాళం వేస్తాం.

– రంగస్వామి, ఇన్‌చార్జి డీఈఓ

మెరుగైన సేవలు అందించాలి



ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి

పుట్టపర్తి టౌన్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం కొత్తచెరువు మండలం పోతులకుంట గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంతో పాటు అంగన్‌వాడీ సెంటర్, ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి పిల్లలను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. వైద్య, వైద్య విధానంలో రాజీపడకూడదని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ పిల్లల పట్ల అశ్రద్ధ వహించకుండా ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

ఎస్పీని కలిసిన నరేష్



ఎస్పీ మాధవరెడ్డితో మాట్లాడుతున్న సినీ నటుడు నరేష్

పుట్టపర్తి టౌన్: జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని సినీ నటుడు నరేష్ గురువారం కలిసారు. గురువారం పుట్టపర్తికి చేరుకున్న ఆయన నేరుగా జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని ఎస్పీ మాధవరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, మాట్లాడారు. 2008లో తనకు గన్ లైసెన్స్ మంజూరు చేశారని, ప్రస్తుతం దానిని రెన్యూవల్ చేయాలని అభ్యర్థించారు. దరఖాస్తు పరిశీలించి రెన్యూవల్ చేస్తామని ఆయనకు ఎస్పీ తెలిపారు.

యర్రాయపల్లి వద్ద చైన్‌స్నాచింగ్

బత్తలపల్లి: ద్విచక్ర వాహనంపై వెంబడించిన యువకులు ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొని ఉడాయించారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఇందిరా నగర్‌కు చెందిన ప్రైవేట్ స్కూల్ టీచర్ రాజేశ్వరి.. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తన తమ్ముడి భార్య, పిల్లలతో కలసి స్కూటీ వాహనంపై బత్తలపల్లిలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. యర్రాయపల్లి వద్దకు చేరుకోగానే అనంతపురం వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు అడ్డుకుని, రాజేశ్వరి మెడలోని రోల్డ్ గోల్డ్ చైన్‌ను లాక్కొని ఉడాయించారు. అందులో రూ.40 వేలు విలువ చేసే బంగారు తాళిబొట్లు, గుండ్లు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కల్లు ముంత.. కాసులతో కళ్లు మూత

- కల్లు విక్రేతల నుంచి నెల మామూళ్లు
- కల్తీ కల్లు విక్రయిస్తున్నా పట్టించుకోకుండా మౌనం
- డబ్బు చెల్లించకపోతే కేసుల నమోదు
- వసూలు చేయాల్సిందేనంటూ కింది స్థాయి ఉద్యోగులను వేధిస్తున్న అధికారి



సాక్షి, పుట్టపర్తి: జిల్లా స్థాయి అధికారి దందాతో కింది స్థాయి ఉద్యోగులు బెంబేలెత్తుతున్నారు. డిపార్టుమెంట్‌కు చెడ్డ పేరు వస్తుందని పరోక్షంగా వారించినా.. ఎవరి మాట వినని సీతయ్య అక్రమ వసూళ్లకు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రతి నెలా తనకు మామూళ్లు వసూలు చేసుకుని రావాల్సిందేనంటూ హుకుం జారీ చేయడంతో కింది స్థాయి ఉద్యోగులు ఇరకాటంలో పడ్డారు. ఇది ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి నిర్వాకం.

ఉద్యోగుల బేజారు

ఎక్సైజ్ శాఖలో ఓ ఉన్నతాధికారి తీరుపై ఆ శాఖలోని ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. లంచాలు దండుకుంటూ శాఖ పరువు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రూ.లక్ష చెల్లించనిదే కల్లు దుకాణాలకు అనుమతులు ఇవ్వరు. ఆఖరుకు కల్లు దుకాణం నిర్వహించుకోవాలన్నా రూ.లక్ష సమర్పించేల్సిందేనంటున్నారు. తన డిమాండ్‌ను నెరవేర్చిన దుకాణాల్లో నిర్వహణ ఎలా ఉన్నా ఆయన చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారు. అంతేకాక ఆయా దుకాణాల్లో ఏవైనా అక్రమాలను సిబ్బంది పసిగడితే వెంటనే వారికి ఫోన్ చేసి, ఎలాంటి కేసులు నమోదు చేయకుండా వెనక్కు రావాలని హుకుం జారీ చేస్తారు. దీంతో జిల్లాలో కల్తీ కల్లు రాజ్యమేలుతోంది.

మామూళ్లు ఇవ్వకుంటే కేసులే..

వ్యాపారుల అవసరాలను తనకు అనుకూలంగా మార్చుకున్న ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారి లంచం తీసుకోవడంతో పాటు ప్రతి నెలా క్రమం తప్పకుండా తనకు మామూళ్లు చెల్లించాల్సిందేనంటూ నిర్బంధ వసూళ్లకు తెరలేపారు. దీంతో కల్లు దుకాణదారులు బెంబేలెత్తిపోతున్నారు. నెలవారీ మామూళ్లు ఇవ్వలేమని తేల్చి చెప్పిన కొందరిపై అక్రమంగా కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేస్తుండడంతో మిగిలిన వారిలో భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో ఆ అధికారి పేరు చెప్పగానే గుట్టుచప్పుడు కాకుండా కోరినంత ముడుపులు చెల్లించుకుంటున్నారు. ఈ నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు వారికి అన్ని విధాలుగా సదరు అధికారి అండగా నిలిచి భరోసానిస్తుండడంతో కల్తీ కల్లు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిస్తోంది.

విక్రేతల ద్వారా వెలుగులోకి

నెలవారీ మామూళ్లు ఇవ్వలేదనే ఉద్దేశంతో తమపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని కొందరు విక్రేతలు తెలిపారు. అంతేకాక కొంతమంది సిబ్బంది తమతో ఆన్‌లైన్ విధానంలో డబ్బు తీసుకున్నట్లు చెబుతున్నారు. వాటికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, నిజాయితీతో వ్యవహరించే అధికారి ఎవరైనా విచారణకు వస్తే వాటిని బయట పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బాధిత వ్యాపారులు అంటున్నారు. ఇదే అంశంపై సదరు అధికారిని వివరణ కోరగా.. సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని దబాయించారు. 'తెలిసిన సమాచారం వార్తగా రాసుకోండి నన్ను అడగడం దేనికి?' అంటూ ఫోన్ కట్ చేశారు.

అక్రమాలు మచ్చుకు కొన్ని

- లేపాక్షి మండలంలో ఓ కల్లు దుకాణంలో కల్తీ కల్లు విక్రయాలకు అనధికారికంగా అనుమతులు జారీ చేస్తానని భరోసానిచ్చిన ఉన్నతాధికారి ఆ దుకాణ నిర్వాహకుడితో రూ.50 వేలు లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- హిందూపురం పట్టణానికి చెందిన ఓ వ్యక్తితో రూ.లక్ష తీసుకుని తనకు గిట్టని వారిపై అనవసరంగా కేసులు నమోదు చేసేందుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో కల్లు దుకాణంపై ఉన్నఫలంగా దాడి చేసి రూ.లక్ష డిమాండ్ చేశారనే విమర్శలున్నాయి.
- ఈత చెట్లు లేకున్నా నిత్యం ఎంత కల్లు విక్రయిస్తున్నారనే లెక్కలు లేకుండా కల్లు దుకాణాలకు ఎడాపెడా అనుమతులు ఇవ్వడం వెనుక ఉన్నతాధికారి పాత్ర కీలకమని అదే శాఖలోని సిబ్బంది చెబుతున్నారు.
- ఎక్సైజ్ శాఖ సిబ్బందిని కూడా అవినీతి కూపంలోకి లాగాలనే ఉద్దేశంతో కొందరితో ఒప్పందం చేసుకోవాలని కూడా ఒత్తిళ్లు పెంచారు. అయితే సిబ్బంది ఎవరూ ఒప్పుకోకపోవడంతో వారిని ఏదో విధంగా ఇబ్బందులు పెడుతుంటారనే ఆరోపణలున్నాయి.

విద్యార్థికి పాముకాటు



విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

యాడికి: పాఠశాలకు వచ్చిన ఓ విద్యార్థి పాముకాటుకు గురయ్యాడు. వివరాలు.. పెద్దవడుగూరు మండలం కోనాపురం గ్రామానికి చెందిన హరినాథ్... నగరూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు పాఠశాలకు చేరుకున్న హరినాథ్... ఆవరణలో బూట్లు వదిలి తన హోం వర్క్ చేసుకున్నాడు. ఇంతలో బెల్ మోగడంతో హడావుడిగా బూట్లు ధరించి ప్రేయర్‌కు హాజరయ్యాడు. ఇంతలో తన కాలుకు ఏదో కుట్టిందంటూ గట్టిగా అరవడంతో హరినాథ్‌ను పీడీ మహబూబ్‌బాషా పక్కకు పిలుచుకెళ్లి బూట్లు విప్పించి చూడగా, లోపల నుంచి ఓ పాము బయటకు వచ్చింది. వెంటనే పామును చంపేసి, బాధిత విద్యార్థిని తన ద్విచక్ర వాహనంపై తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి పీడీ తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆస్పత్రికి చేరుకుని బాధిత విద్యార్థిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. సకాలంలో విద్యార్థిని ఆస్పత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలపడంతో అక్కడే ఉన్న పీడీ మహబూబ్‌బాషాను ఎమ్మెల్యే అభినందించారు.

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు



విజయలక్ష్మి (ఫైల్)

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన విజయలక్ష్మి మరణానంతరం తన నేత్రాలను దానం చేసి మరో ఇద్దరికి కంటి చూపునిచ్చారు. ఈ నెల 5న విజయలక్ష్మి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహం నుంచి నేత్రాలను మధుగిరికి చెందిన డాక్టర్ గాయిత్రీనారాయణ్ సేకరించి బెంగళూరులోని డాక్టర్ రాజ్‌కుమార్ నేత్ర నిధికి చేర్చారు. కాగా, ఆమె నేత్రాలను గురువారం ఇద్దరికి శస్త్రచికిత్స చేసి అమర్చినట్లు సమాచారం.

ఎంటీఎస్ టీచర్లపై వివక్ష

రాప్తాడు రూరల్: కొందరు మండల విద్యాశాఖ అధికారులు చూపుతున్న వివక్ష కారణంగా చాలామంది 98–డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు ఏప్రిల్ నెల జీతాలు అందలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 390 మంది 98–డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు పని చేస్తున్నారు. వీరంతా ఏప్రిల్ 13న విధుల్లో చేరారు. ఆ నెలలో 18 రోజులు పని చేశారు. విధుల్లో చేరే రోజు దాదాపు అందరూ అగ్రిమెంట్ బాండ్లు ఇచ్చేశారు. 18 రోజులకు గాను రూ.19,402 జీతం రావాల్సి ఉంది. అయితే మండల విద్యాశాఖ అధికారులు బిల్లులు పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కళ్యాణదుర్గం, కూడేరు, గుమ్మఘట్ట, లేపాక్షి, బొమ్మనహాళ్‌గుప్ప, రాయదుర్గం తదితర మండలాల్లో దాదాపు 50 మంది వరకు జీతాలు చేశారు. మిగిలిన 340 మందికి బిల్లులకు ఆమోదం తెలపడంతో ఆయా ఎంఈఓలు మీనమేషాలు లెక్కిస్తున్నారు. 23 ఏళ్ల తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో తామంతా ఉద్యోగాల్లో చేరామని అయితే ఎంఈఓలు ఇలా బిల్లులు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారంటూ పలువురు ఎంటీఎస్‌లు వాపోతున్నారు.

సేవా కార్యక్రమాలపై చైతన్య పరచాలి

అనంతపురం: విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా విద్యార్థులను చైతన్య పరచాలని ఎస్కేయూ వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, కమ్యూనిటీ సర్వీసెస్, లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాలపై ఎస్కేయూలోని పూలే భవనంలో గురువారం బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్, ఉన్నత విద్యామండలి, సమగ్రశిక్ష, యూనిసెఫ్ ఆధ్వర్యంలో బోర్డ్‌ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (బీసీడీఈ)కు సంబంధించిన నోడల్ ఆఫీసర్లకు ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. అనుబంధ డిగ్రీ కళాశాలల్లో కమ్యూనిటీ ప్రాజెక్ట్‌లు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ ప్రాజెక్ట్‌ల వల్ల విద్యార్థుల్లో చదవడం, మాట్లాడడం, రాయడం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతాయన్నారు. ఎస్కేయూ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.కృష్ణకుమారి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో బీసీడీఈ సీఈఓ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. సత్యనారాయణ, యూనిసెఫ్ కన్సల్టెంట్ టి.సుదర్శన్, శిక్షణ ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజర్ అప్పారావు, సమగ్రశిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ చంద్రమోహన్ రెడ్డి, రీసోర్స్ పర్సన్ మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొంగల అరెస్ట్

- కంప్యూటర్, ప్రొజెక్టర్, బ్యాటరీలు స్వాధీనం

ధర్మవరం అర్బన్: ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి, వారి నుంచి కంప్యూటర్, ప్రొజెక్టర్, బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. గత నెల 29న రాత్రి లోనికోటలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో కంప్యూటర్, బ్యాటరీలు చోరీ అయ్యాయి. ఘటనకు సంబంధించి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం మధ్యాహ్నం ధర్మవరం చెరువు మరువ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న స్థానిక బడేసాహెబ్ వీధికి చెందిన నల్లబోతుల ముత్యాలు, లోనికోటకు చెందిన అవుకు మాహిస్ ఖాన్, జావేద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. దీంతో ఉర్దూ పాఠశాలలో చోరీ చేసింది తామేనని అంగీకరించడంతో వారి నుంచి 6 బ్యాటరీలు, కంప్యూటర్, ప్రొజెక్టర్, స్పీకర్‌తో పాటు ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో మరొకరు పరారీలో ఉన్నాడు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

వికటించిన సూది మందు



మృతుడు అల్లాబకాష్

హిందూపురం టౌన్: సూది మందు వికటించి ఓ రోగి మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన మేరకు.. హిందూపురంలోని హస్నాబాద్‌కు చెందిన అల్లాబకాష్ (55) బుధవారం రాత్రి తలనొప్పితో బాధపడుతూ జిల్లాస్పత్రికి చికిత్స కోసం వెళ్లాడు. పరీక్షించిన అత్యవసర విభాగంలోని వైద్యుల సూచన మేరకు డ్యూటీ నర్సులు సూది మందు ఇచ్చి, కాసేపు అక్కడే విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయితే వైద్యుల సూచన పాటించకుండా అల్లాబకాష్ ఇంటికి చేరుకున్నాడు. ఓ గంట తర్వాత అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటినా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సూది మంది వికటించడం వల్లనే అల్లాబకాష్ మృతి చెందాడంటూ ఆందోళనకు దిగారు. అనంతరం వైద్యులు, పోలీసులు నచ్చజెప్పడంతో మృతదేహాన్ని తీసుకుని వెళ్లారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్ మాట్లాడుతూ.. 'బుధవారం రాత్రి 9 గంటలకు ఆస్పత్రికి వచ్చిన అల్లాబకాష్ తలనొప్పి, బాడీ పెయిన్స్ ఎక్కువగా ఉన్నట్లు తెలిపాడు. దీంతో డ్యూటీ వైద్యుల సూచన మేరకు సూది మందు ఇచ్చి, ఓ గంట పాటు తమ పర్యవేక్షణలోనే ఉండాలని నర్సులు తెలిపారు. అయినా అల్లాబకాష్ వినకుండా ఇంటికి వెళ్లిపోయాడు. తిరిగి రాత్రి 10.30 గంటలకు మృతదేహం తీసుకువచ్చి ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. చికిత్సలో ఎలాంటి లోపం లేదు. మృతికి మరే ఇతర కారణాలు ఉండవచ్చు'నని పేర్కొన్నారు.

టెక్నాలజీపై పట్టు సాధిస్తే కొలువులకు కొదువలేదు



కోర్సు పూర్తి చేసిన విద్యార్థులతో రైజ్ ప్రతినిధి

ప్రశాంతి నిలయం: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై పట్టు సాధిస్తే విస్తృత ఉపాధి అవకాశాలు దక్కుతాయని ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆస్ట్రియాలోని వియన్నా యూనివర్సిటీకి చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక నిపుణుడు పాల్ స్పెసిబర్గర్ సూచించారు. రైజ్ ఆస్ట్రియా, ఇంటర్నేషన్ ప్రోగ్రాం ఫర్ స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆర్ఐటీ కోర్సు పూర్తి చేసుకున్న 30 మంది విద్యార్థులకు కోర్సు కంప్లీషన్ సర్టిఫికెట్ల ప్రదానం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్చువల్ విధానంలో వియన్నా యూనివర్సిటీ నుంచి పలువురు సాంకేతిక నిపుణులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠ్యాంశాలతో పాటు నిత్యం అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రయోగపూర్వక, అనుభవ పూర్వక పరిజ్ఞానం సాధించడం ప్రతి విద్యార్థికీ చాలా అవసరమన్నారు. ప్రణాళికలతో ముందుకు సాగితే ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ బాల కోటేశ్వరి, రైజ్ సంస్థ ప్రతినిధి ఎన్నో స్టబ్లర్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో అనంతపురం సబ్ రిజిస్ట్రార్

- గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు రూ.2 లక్షలు డిమాండ్
- రూ.1.30 లక్షలు తీసుకుంటూ పట్టుబడిన వైనం
- రిజిస్ట్రార్‌తోపాటు డాక్యుమెంట్ రైటర్లు చంద్రశేఖరరావు, కృష్ణ మురళీ అరెస్ట్



సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి



డాక్యుమెంట్ రైటర్ అసిస్టెంట్ కృష్ణమురళీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గిఫ్ట్ డీడ్ కింద లాడ్జ్ రిజిస్ట్రేషన్ చేయడానికి లంచం డిమాండ్ చేసిన అనంతపురం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణమూర్తి ఏసీబీకి దొరికిపోయాడు. డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖరరావుతోపాటు అతని అసిస్టెంట్ కృష్ణ మురళీ ద్వారా రూ.1.30 లక్షలు తీసుకుంటుండగా గురువారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన ఏసీబీ అధికారుల సోదాలు రాత్రి పొద్దుపోయే వరకూ కొనసాగాయి.

అధికారుల నిర్బంధం

గురువారం సాయంత్రం అనంతపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులు వెంటనే కార్యాలయం తలుపులు మూసివేశారు. ఉద్యోగులు, సిబ్బంది నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బయటకు పంపకుండా నిర్బంధించారు. అనంతరం లంచంగా అచ్చిన డబ్బును తీసుకున్న కృష్ణ మురళీని రిజిస్ట్రార్ ఉద్యోగులు, సిబ్బంది ఎదుటే ప్రశ్నించారు. అతను సహకరించకపోవడంతో అక్కడే కౌన్సెలింగ్ ఇచ్చారు.

రూ.1.30 లక్షలకు బేరం

సోదాలకు సంబంధించిన వివరాలను ఒంగోలు ఏసీబీ డీఎస్పీ, అనంతపురం ఇన్‌చార్జ్ ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు మీడియాకు వివరించారు. అనంతపురానికి చెందిన అన్నదమ్ములు ముత్తుకూరు రామ్మోహన్‌రావు, రవీంద్రనాథ్ 1996లో ఆర్టీసీ బస్టాండు సమీపంలోని స్థలం కొనుగోలు చేశారు. ప్రస్తుతం 'కోమల' పేరుతో ఓ లాడ్జిని నడుపుతున్నారు. గత నెల రామ్మోహన్‌రావు అన్న రవీంద్రరావు మరణించారు. దీంతో తన అన్న వాటాను గిఫ్ట్ డీడ్ కింద తనపేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రామ్మోహన్‌రావు భావించారు. ఇందుకోసం అన్ని పత్రాలతో అనంతపురం సబ్‌రిజిస్ట్రార్‌ను కలిశారు. అయినప్పటికీ రిజిస్ట్రార్ పెండింగ్ ఉంచారు. స్థలాన్ని పరిశీలించి అనంతరం రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లిన రిజిస్ట్రార్ సత్యనారాయణ మూర్తి... ఇది కమర్షియల్ భవనం అయినందున రిజిస్ట్రేషన్ చేయడానికి కుదరదని తెలిపారు. దీంతో అక్కడే ఉన్న డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖర్‌రావు కలుగజేసుకుని డబ్బిస్తే రిజిస్ట్రేషన్ చేస్తారని చెప్పారు. రూ. లక్ష ఇచ్చేందుకు రామ్మోహన్ సిద్ధపడినా సబ్ రిజిస్ట్రార్ ఒప్పుకోలేదు. రూ. 2 లక్షలు ఇస్తే పని పూర్తి చేస్తామని చెప్పారు. రామ్మోహన్ విధిలేక డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖరరావు వద్దకు వెళ్లి బేరమాడితే ఎట్టకేలకు రూ.1.30 లక్షలకు ఒప్పుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని రామ్మోహన్... ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచన మేరకు గురువారం రూ.1.30 లక్షలు తీసుకుని సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణను కార్యాలయంలో కలిశారు. అతని సూచన మేరకు డబ్బును డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖరరావు ఇవ్వగా, అతను అసిస్టెంట్ కృష్ణమురళీకి ఇచ్చాడు. సాయంత్రం 4 గంటల సమయంలో కృష్ణమురళీ నుంచి సబ్‌రిజిస్ట్రార్ తీసుకుంటుండగా, అప్పటికే మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కృష్ణమురళీ ఏసీబీ అధికారులను చూసి అక్కడి నుంచి ఉడాయించే ప్రయత్నం చేయగా, అతనికి అక్కడే కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ సెల్‌ఫోన్‌లో జరిపిన సంభాషణలు రికార్డు కావడంతో ఏసీబీ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణతోపాటు డాక్యుమెంట్ రైటర్ చంద్రశేఖరరావు, అతని అసిస్టెంట్ కృష్ణమురళీలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వీరిని శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపరుస్తామని వెల్లడించారు.

అమెరికా భక్తుల పర్తియాత్ర

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా అమెరికాకు చెందిన వందలాది సత్యసాయి భక్తులు గురువారం పుట్టపర్తికి చేరుకున్నారు. సాయంత్రం సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమెరికాలోని వివిధ నగరాలకు చెందిన బాలవికాస్ విద్యార్థులు నృత్య రూపకాలతో ఆకట్టుకున్నారు.



సంగీత కచేరి నిర్వహిస్తున్న అమెరికా భక్తులు